## సాంకేతిక శిక్షణ కోర్సులకు దరఖాస్తులు

భూదాన్‌పోచంపల్లి, ఫిబ్రవరి 18 : మండలంలోని జలాల్‌పూర్ గ్రామం స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో దీన్ దయాళ్ ఉపాధ్యాయ గ్రామీణ కౌశల్య యోజన (డీడీయూజీకేవై) ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు ఉపాధి ఆధారిత సాంకేతిక శిక్షణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సంస్థలో మూడున్నర నెలల కాల పరిమితితో కూడిన బేసిక్ కంప్యూటర్స్ డాటా ఎంట్రీ ఆపరేటర్ (ఇంటర్మీడియట్ పాస్), కంప్యూటర్ హార్డ్‌వేర్ అసిస్టెంట్ (10వ తరగతి పాస్), సెల్ ఫోన్ ఎలక్ట్రానిక్ వస్తువుల రిపేర్ (నాలుగు నెలలు) పదో తరగతి.. ఎలక్ట్రీషియన్ డొమెస్టిక్, సోలార్ సిస్టం ఇన్‌స్టాలేషన్ సర్వీస్ (పదో తరగతి పాస్ ఐటీఐ ఉన్నవారికి ప్రాధాన్యం) కోర్సులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. అర్హతగల ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ సెట్, పాస్‌పోర్ట్ సైజ్ ఫొటో, ఆధార్ కార్డ్, రేషన్ కార్డుతో ఈ నెల 22న ఉదయం 11 గంటలకు అడ్మిషన్ల కోసం హాజరుకావాలని తెలిపారు. ఉచిత శిక్షణ, హాస్టల్, భోజన వసతి పాటు ఉద్యోగం కల్పించనున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9133908000, 9133908111, 9133908222, 994846 6111 ఫోన్ నంబర్లను సంప్రదించలని సూచించారు.



పెద్దగట్టు జాతరలో బోనం ఎత్తుకొని వస్తున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన మాజీ ఎంపీ బడుగుల లింగయ్య, బాలరాజు యాదవ్, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక

# లోలోతుకు భూగర్భ జలాలు

## గతేడాది జనవరితో పోలిస్తే 2.71మీటర్లు కిందికి



- 16 మండలాల్లో తగ్గిన నీటి మట్టం
- సంస్థాన్ నారాయణపురంలో 22.09 మీటర్ల లోతులో నీళ్లు
- అడ్డగూడూరులో మాత్రం పైపైకి పాతాళ గంగ
- సాగు, తాగు నీటికి తిప్పలు తప్పవా?

### యాదాద్రి జిల్లాలో సగటున 10 మీటర్లకు పడిపోయిన గంగమ్మ

**జిల్లాలో భూగర్భ జలాలు రోజురోజుకూ పడిపోతున్నాయి. బోర్లు, బావులు నీటి జాడ లేక వట్టిపోతున్నాయి. జనవరి నెలలో సగటున 10 మీటర్ల కిందికి వెళ్లాయి. ఇప్పుడే ఇలా ఉంటే ఎండకాలం పరిస్థితి ఏంటనే ఆందోళన వ్యక్తమవుతున్నది. జిల్లాలో గతంలో పుష్కలంగా ఉన్న పాతాళ గంగ ఇప్పుడు అడుగంటుతున్నది. ఇంతకు ముందు ఐదు మీటర్ల లోతులోనే నీళ్లు ఉండగా, ప్రస్తుతం రెట్టింపు స్థాయిలో కిందికి వెళ్లాయి. జిల్లాలో 2024 జనవరిలో 7.29 మీటర్ల లోతులో భూగర్భ జలాలు ఉండగా, ఈ జనవరిలో 10 మీటర్లకు చేరాయి. 2.71 మీటర్ల మేర పడిపోయాయి. డిసెంబర్‌లో 9.03మీటర్ల దూరంలో ఉండగా.. నెల వ్యవధిలోనే మీటరు కిందికి వెళ్లాయి.**

– యాదాద్రి భువనగిరి, ఫిబ్రవరి 18 (నమస్తే తెలంగాణ)



రాజాపేట : నీళ్లు లేక కుర్రారంలో ఎండిన పోయిన వరి చేనులో పశువులను మేపుతున్న రైతు కొండల్‌రెడ్డి

#### మండలాల వారీగా..

జిల్లాలో 17మండలాలు ఉండగా.. గతేడాది జనవరితో చూస్తేఅడ్డగూడూరు మినహా అన్ని చోట్లా భూగర్భ జల మట్టం తగ్గింది. అత్యధికంగా సంస్థాన్‌నారాయణపురం మండలంలో ఇంకిపోయింది. ఏకంగా 11.48 మీటర్ల మేర కిందికి నీళ్లు పడిపోయాయి. గతేడాది 10.61 మీటర్లలో నీళ్లు ఉండగా, ఈసారి ఏకంగా 22.09 మీటర్లకు పడిపోయాయి. ఆత్మకూరు(ఎం)లో 17.10, తుర్కపల్లి, ఆలేరు, బొమ్మలరామారం, రామన్నపేట, మోటకొండూరు మండలాల్లో 11మీటర్ల దూరంలో ఉన్నాయి. అడ్డగూడూరులో 4.01, భూదాన్‌పోచంపల్లిలో 4.73, చౌటుప్పల్‌లో 5.69 మీటర్ల వద్ద నీటి మట్టం ఉంది.

#### నీళ్లకు కష్టాలే..

జిల్లాలో 3 లక్షల ఎకరాల్లో రైతులు వివిధ పంటలు సాగు చేశారు. అధికంగా వరి వేశారు. జిల్లాలో వేల సంఖ్యలో బోరు బావులు ఉన్నాయి. వీటి కింద అత్యధికంగా వరి సాగు చేస్తున్నారు. ఈసారి వానకాలంలో వర్షపాతం సాధారణంగానే నమోదైనప్పటికీ, యాసంగి సాగు విస్తీర్ణం పెరుగడంతో బోరు బావుల ద్వారా నీటి వినియోగం పెరిగింది. ఇప్పటికే పలు ఏరియాల్లో బోర్లలో నీటి ధారలు తగ్గుతున్నాయి. దాంతో పంటలు కూడా ఎండిపోతున్నాయి. ఫిబ్రవరిలోనే పరిస్థితి ఇలా ఉంటే ఏప్రిల్, మే నెలలో ఎలా ఉంటుందోనని అంతా ఆందోళన చెందుతున్నారు.

### 7 బోర్లు వేసినా ఏడుపే మిగిలింది

- చుక్క నీరూ పడక ఎండిన వరి పైరు
- పశువులకు మేతకు వదిలిన రైతు

రాజాపేట, ఫిబ్రవరి 18 : రాజాపేట మండలంలోని కుర్రారం గ్రామానికి చెందిన రైతు రావి కొండల్‌రెడ్డి తనకు ఉన్న రెండు బోర్లతో ఈ యాసంగి ఏడెకరాల్లో వరి సాగు చేశాడు. రెండూ బోర్లు ఎండిపోవడంతో పంటను కాపాడుకోవడం కోసం అప్పు చేసి బోరు వెంట బోరు వేస్తూ మొత్తం ఏడు బోర్లు వేశాడు. ఏ ఒక్క దాంట్లోనూ నీళ్లు పడకపోవడంతో పంటంతా ఎండిపోయింది. దాంతో చేసేది లేక వరి పైరును పశువులకు మేతకు వదిలివేశాడు. ఈసారి ప్రభుత్వం నుంచి పెట్టుబడి సాయం అందక పోవడంతో అప్పు చేసి మరీ వరి సాగు చేసినట్లు రైతు కొండల్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు. ఊళ్లో ఉన్న చెరువు ఎండిపోవడంతో బోర్లలో నీళ్లు అడుగంటాయని తెలిపాడు. ఏడు బోర్లు వేసినా చుక్క నీరు రాక ఏడుపే మిగిలిందని వాపోయాడు. ఎండిన పొలంలో పశువులను మేపుతున్నానని, పదేండ్లలో ఎన్నడూ ఇలాంటి పరిస్థితి లేదని దుఃఖంతో చెప్పుకొచ్చాడు.

# బీఆర్ఎస్ పాలనలోనే పెద్దగట్టు అభివృద్ధి

## కేసీఆర్‌తోనే సూర్యాపేట జిల్లా, మెడికల్ కాలేజీ

- నాడు కాళేశ్వరం జలాలతో ఎవుసం సస్యశ్యామలం
- మేడిగడ్డను పండబెట్టి పంటలను ఎండబెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం
- నీళ్లెందుకు ఇవ్వరో ఉత్తమ్ సమాధానం చెప్పాలి
- లింగన్న ఆశీస్సులు అందరిపై ఉండాలి
- పెద్దగట్టు జాతరలో బోనమెత్తిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

సూర్యాపేట టౌన్, ఫిబ్రవరి 18 : రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదైన దురాజ్‌పల్లి లింగమంతుల స్వామి (పెద్దగట్టు) జాతరకు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత వచ్చారు. మంగళవారం బోనం ఎత్తుకుని మెట్ల మార్గం గుండా వచ్చి చౌడమ్మకు సమర్పించారు. లింగమంతుల స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. బోనం ఎత్తుకుని వచ్చే క్రమంలో దగ్గరికి వచ్చిన భక్తులను ఆప్యాయంగా పలుకరిస్తూ ముందుకు సాగారు. అనంతరం మీడియాతో ఆమె మాట్లాడారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర బిల్లు లోకసభలో ఆమోదం పొందిన రోజున పెద్దగట్టు జాతరకు రావడం సంతోషంగా ఉందన్నారు. భక్తులు ప్రశాంత వాతావరణంలో జాతర జరుపుకోవాలని, లింగన్న ఆశీస్సులు అందరిపై ఉండాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ హయాంలో రూ.14 కోట్లు వెచ్చించి కనీవినీ ఎరుగని రీతిన పెద్దగట్టును అభివృద్ధి చేయడాన్ని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రం రావడం వల్లే సూర్యాపేట జిల్లా అయ్యిందన్నారు. దాదాపు 50 సంవత్సరాలు పాలించిన కాంగ్రెస్, టీడీపీ ఏనాడూ సూర్యాపేటకు మెడికల్ కళాశాల కావాలన్న ఆలోచన చేయలేదని తెలిపారు. గతంలో తాము ఇక్కడ కళాశాల పెడుతామంటే పెట్టనీయకుండా చేశారని ఎన్ఆర్ఐలు కొందరు చెప్తుంటారని పేర్కొన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో సూర్యాపేటకు ప్రభుత్వ మెడికల్ కాలేజీ వచ్చిందని తెలిపారు. ఇక్కడి ఎస్పీ ఆఫీసు చూస్తే ఉత్తర భారతదేశంలోని చిన్న చిన్న రాష్ట్రాల్లో సెక్రటేరియట్లు కూడా ఇలా ఉండవన్నారు. పేదింటి బిడ్డలకు నాణ్యమైన విద్యను అందించేందుకు కేసీఆర్ 1,200 వసతి గృహాలు, వెయ్యికిపైగా జూనియర్ కళాశాలలు, 27 మహిళా డిగ్రీ కళాశాలలు అందుబాటులోకి తెచ్చారని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీళ్లు తెచ్చి సూర్యాపేట జిల్లాలను సస్యశ్యామలం చేసిన ఘనత కేసీఆర్‌దేనని తెలిపారు. నాడు సూర్యాపేట జిల్లాలో దాదాపు 2.95 లక్షల ఎకరాలకు కాళేశ్వరం ద్వారా నీళ్లను అందిస్తే.. నేడు కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డను పండబెట్టి పంటలను ఎండబెడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇదే జిల్లాకు చెందిన నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఎందుకు నీళ్లు తేవడం లేదో సమాధానం చెప్పాలని నిలదీశారు. మేడిగడ్డ ఇంజినీర్లు ప్రాజెక్టును వినియోగించుకోవచ్చని చెప్తున్నా కక్షపూరితంగా వాడడం లేదని తెలిపారు. రైతుల పంటను ఎండబెడుతున్న ఉసురు కాంగ్రెస్ పార్టీకి తగులుతుందన్నారు. లింగమంతుల స్వామిని దర్శించుకున్న వారిలో జిల్లా పార్టీ అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, రాష్ట్ర నాయకుడు దూదిమెట్ల బాలరాజు, జడ్పీ వైస్ చైర్‌పర్సన్ గుజ్జ దీపికాయుగంధర్‌రావు తదితరులు ఉన్నారు.



లింగమంతుల స్వామి దర్శనానికి బారులు దీరిన భక్తులు

## కిక్కిరిసిన పెద్దగట్టు

- లక్షలాదిగా తరలివచ్చిన జనం
- మాజీ మంత్రి తలసాని, మాజీ ఎమ్మెల్యేల పూజలు

సూర్యాపేట టౌన్/చివ్వెంల, ఫిబ్రవరి 18 : దురాజ్‌పల్లి పెద్దగట్టు జాతరకూ మూడో రోజూ జనం పోటెత్తారు. లింగమంతుల స్వామిని దర్శనానికి మంగళవారం తెల్లవారుజాము నుంచి రాత్రి వరకు దాదాపు 5లక్షల మందికిపైగా వచ్చినట్లు అంచనా. యాదవ పెద్దలు గుడి ముందు చంద్రపట్నం వేసి గంగమ్మ, కాటంరాజు, ఎర్రయ్య, యలమంచమ్మ, సౌనమ్మ తదితర 12 దేవతామూర్తుల విగ్రహాలను పెట్టి ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం బలి ఇచ్చి విగ్రహాలను తీసేశారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, మాజీ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్, బొల్లం మల్లయ్యయాదవ్, కంచర్ల భూపాల్‌రెడ్డి, నోముల భగత్, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమ భరత్‌కుమార్, చంద్రవతి, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, మాజీ మున్సిపల్ చైర్మన్ పుట్ట కిషోర్, నాయకులు గండూరి క్రుపాకర్, రంగినేని ఉపేందర్, బూర బాలసైదులు స్వామివారిని దర్శించుకున్నారు. జాతర సందర్భంగా ఏర్పాటు చేసిన వివిధ ఎగ్జిబిషన్‌లో చిన్నాపెద్ద సందడి చేశారు. దుకాణాలన్నీ కిటకిటలాడాయి.

అధికార యంత్రాంగం గుట్టపైన పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టింది.

## రెండో విడుత దళిత బంధు నిధులు విడుదల చేయాలి

- లేదంటే మంత్రి కోమటిరెడ్డి క్యాంప్ కార్యాలయం ముట్టడి
- దళితబంధు సాధన కమిటీ

రామగిరి, ఫిబ్రవరి 18 : ఎన్నికల కోడ్ కారణంగా ఆగిపోయిన రెండో విడుత దళిత బంధు నిధులను ప్రభుత్వం విడుదల చేయాలని దళిత బంధు సాధన కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు కొరిలా మహేశ్ డిమాండ్ చేశారు. నల్లగొండలోని అంబేద్కర్ భవన్‌లో మంగళవారం ఉమ్మడి నల్లగొండ జిల్లా దళిత బంధు లబ్ధిదారుల సమావేశం నిర్వహించారు. దళిత బంధు రెండవ విడుతలో లబ్ధిదారులను ఎంపిక చేసి ప్రొసీడింగ్స్ ఇచ్చి నిధులు కేటాయించినా, ఎన్నికల నోటిఫికేషన్ కారణంగా ఆగిపోయిందని గుర్తు చేశారు. ఒక్క నల్లగొండ నియోజకవర్గంలోనే 1,050 మంది లబ్ధిదారులకు నిధులు అందాల్సి ఉన్నాయన్నారు. నేటికీ ఆ నిధులు విడుదల చేయకపోవడం అన్యాయమన్నారు. హుజూరాబాద్, మధిర నియోజకవర్గాల్లో రెండు విడుత దళిత బంధు అమలు చేశారని, నల్లగొండ జిల్లాలోనూ అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితుల పేర మంజూరైన నిధులను వెంటనే విడుదల చేయాలని, లేనిపక్షంలో మంత్రి కోమటిరెడ్డి క్యాంప్ కార్యాలయం ముట్టడిస్తామని హెచ్చరించారు. కుల వివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పాలడుగు నాగార్జున మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేవెళ్లలో ప్రకటించిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ప్రకారం అంబేద్కర్ అభయ హస్తం పేర ఇస్తామన్న రూ.12లక్షల పథకం ఏమైందని ప్రశ్నించారు. దళితుల కోసం ప్రకటించిన పథకాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దళితులంతా ఏకమై తగిన సమయంలో పాలకులకు బుద్ధి చెప్పాలన్నారు. కార్యక్రమంలో దళిత బంధు సాధన కమిటీ నాయకులు, అంబేద్కర్ భవన్ కన్వీనర్ బొర్ర సుధాకర్, బడుపుల శంకర్, కందుల లక్ష్మయ్య, అవుట రవీందర్, ఆదిమల్ల లింగయ్య, పేర్ల అశోక్, పెరిక యాదయ్య, ఈర్ల ప్రసాద్, కందుల రమేశ్, పేరపాక నరసింహ పాల్గొన్నారు.



జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న దళితబంధు సాధన కమిటీ నాయకులు

### జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు అనిల్‌కుమార్

నేరేడుచర్ల, ఫిబ్రవరి 18 : మండలంలోని కల్లూరు గ్రామానికి చెందిన సంకలబుడ్డి అనిల్ కుమార్ జాతీయ స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యాడు. తెలంగాణ రాష్ట్ర కబడ్డీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈనెల 4 నుంచి 7 వరకు ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన సీనియర్ రాష్ట్ర స్థాయి 71వ పురుషుల కబడ్డీ పోటీల్లో సూర్యాపేట జిల్లా జట్టు ప్రథమ స్థానం సాధించడంలో అనిల్ ప్రతిభ కనబర్చాడు. పోటీల అనంతరం రాష్ట్ర వ్యాప్తంగా 30 మంది క్రీడాకారులను ఎంపిక చేయగా అందులో అనిల్ కుమార్ కూడా ఉన్నాడు. ఈనెల 20 నుంచి 23 వరకు ఒడిశా రాష్ట్రంలో జరుగనున్న జాతీయ స్థాయి కబడ్డీ పోటీల్లో అనిల్ పాల్గొననున్నాడు. అనిల్ తండ్రి గోపి ట్రాక్టర్ మెకానిక్‌గా పని చేస్తుండగా తల్లి పద్మ కూలి పనులకు వెళ్తుంటుంది. నిరుపేద కుటుంబానికి చెందిన అనిల్ కుమార్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం పట్ల పలువురు అభినందిస్తున్నారు.



అనిల్ కుమార్

## పరిహారం చెల్లించాకే పనులు చేపట్టాలి

- నర్సిరెడ్డిగూడెం ముంపు బాధితుల ఆందోళన

మర్రిగూడ, ఫిబ్రవరి 18 : శివన్నగూడెం ప్రాజెక్టులో ఇండ్లు, భూములు కోల్పోతున్న నిర్వాసితులందరికీ ప్లాట్లు, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద నష్టపరిహారం చెల్లించాకే ప్రాజెక్టు పనులను కొనసాగించాలని భూనిర్వాసితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం మర్రిగూడ మండలంలోని శివన్నగూడెం ప్రాజెక్టు నర్సిరెడ్డిగూడెం నిర్వాసితులు ఆందోళనకు దిగారు. ప్రాజెక్టు పనులను అడ్డుకొని నిరసన తెలిపారు. గ్రామంలో 32 మందికి ప్లాట్లు, పరిహారం రావాల్సి ఉండగా, అవి అందించకుండానే అధికారులు గ్రామాన్ని ఖాళీ చేయిస్తున్నారని మండిపడ్డారు. భూసేకరణ సమయంలో చాలామందికి డీఎల్ఐఎస్ నంబర్లు కేటాయించలేదని, వారికి దిక్కెవరని ప్రశ్నించారు. ప్రభుత్వం స్పందించి న్యాయం చేయాలని కోరారు. సీఐ నవీన్‌కుమార్ పోలీసులతో అక్కడి చేరుకుని పనులకు సహకరించాలని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించేలా చూస్తామని హామీ ఇవ్వడంతో నిర్వాసితులు ఆందోళన విరమించారు.



శివన్నగూడెం ప్రాజెక్టు కట్ట వద్ద ఆందోళన చేస్తున్న నర్సిరెడ్డిగూడెం నిర్వాసితులు

## హత్య కేసులో 18 మందికి జీవిత ఖైదు

- ఒక్కొక్కరికి రూ.6వేల జరిమానా
- నల్లగొండ ఎస్సీ, ఎస్టీ సెషన్ కోర్టు న్యాయమూర్తి రోజారమణి తీర్పు
- జిల్లా జైలుకు నిందితుల తరలింపు
- అజీంపేటలో పోలీస్ పికెట్



అడ్డగూడూరు మండలం అజంపేటలో పోలీసుల బందోబస్తు

రామగిరి/అడ్డగూడూరు, ఫిబ్రవరి 18 : ఏడేండ్ల కిందట జరిగిన హత్య కేసులో నల్లగొండ ఎస్సీ, ఎస్టీ సెషన్ కోర్టు 18మంది నిందితులకు జీవిత ఖైదు విధించింది. యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలోని అజీంపేట గ్రామంలో దసరా రోజున ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన బట్ట లింగయ్య హత్య జరిగింది. విచారణ జరిపిన పోలీసులు ఈ కేసులో 18మందిని నిందితులుగా పేర్కొన్నారు. కోర్టులో కేసు నడుస్తున్నది. నిందుల్లో ఒకరు మరణించగా.. మిగతా వారికి జీవిత ఖైదీతోపాటు ఒక్కొక్కరికి 6వేల రూపాయల జరిమానా విధిస్తూ నల్లగొండ ఉమ్మడి జిల్లా ఎస్సీ, ఎస్టీ స్పెషల్ సెషన్ కోర్టు న్యాయమూర్తి, రెండో అదనపు జడ్జి ఎన్.రోజారమణి మంగళవారం తీర్పు వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. 2017 సెప్టెంబర్ 30 దసరా రోజున అజింపేట గ్రామానికి చెందిన బట్ట లింగయ్య జమ్మి చెట్టు వద్దకు వెళ్లి వస్తుండగా.. అప్పటి గ్రామ సర్పంచ్ పోలెబోయిన లింగయ్య ప్రోద్బలంతో అతడి అనుచరులు కొంతమంది కులం పేరుతో బట్ట లింగయ్యను దూషించారు. జమ్మిచెట్టు వద్దకు వస్తావా? తన తండ్రిపై విచక్షణారహితంగా దాడి చేసి హత్య చేసినట్లు ఆయన కుమారుడు బట్ట వెంకన్న పోలీసులు ఫిర్యాదు చేశారు. అడ్డగూడూరు పోలీసులు 18 మంది నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు తర్వాత కోర్టుకు అప్పగించారు. సుదీర్ఘ విచారణ అనంతరం న్యాయమూర్తి ఎన్.రోజారమణి తీర్పునిచ్చారు. 18 మంది నిందితులకు జీవిత ఖైదు వేశారు. నిందితుల్లో జక్కుల భిక్షమయ్య అనారోగ్యంతో ఇప్పటికే మరణించారు. మిగిలిన 17మందిని జీవిత ఖైదీతోపాటు ఒక్కొక్కరికి రూ.6వేల జరిమాన విధించారు. దాంతో పోలీసులు వారిని నల్లగొండ జిల్లా కేంద్ర ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించి, బందోబస్తుతో జిల్లా జైలుకు తరలించారు. తీర్పు సందర్భంగా అజీంపేట గ్రామంలో అవాంఛనీయ ఘటనలు జరుగకుండా చౌటుప్పల్ ఏసీపీ మధసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేశారు. కోర్టు తీర్పుపై బట్ట లింగయ్య భార్య యాదమ్మ స్పందిస్తూ.. తన భర్తను హత్య చేసిన నిందితులకు జీవిత ఖైదు శిక్ష పడడంతో తనకు న్యాయం దక్కిందన్నారు. 2012 నుంచి తాము ఐదేండ్లు ఊరికి రాలేదని, దసరా రోజున ఇంటికి వస్తే సాయంత్రం జమ్మి దగ్గర తన భర్తను అందరూ చూస్తుండగానే చంపారని వాపోయింది. నిందితుల కుటుంబ సభ్యుల నుంచి ప్రాణభయం ఉన్నట్లు పేర్కొంది.



బట్ట లింగయ్య (ఫైల్‌ఫొటో)

#### ఒక్కో ఇంటి నుంచి ముగ్గురు.. నలుగురు

హత్యకు గురైన బట్ట లింగయ్య అదే గ్రామంలోని యాదవ సామాజిక వర్గానికి చెందిన పండుగ రాజమల్లును 2012 సంవత్సరంలో హత్య చేసిన కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్నాడు. ఆ కేసులో ఐదేండ్లు జైలుకు వెళ్లిరాగా, అదే ఏడాది దసరా పండుగ రోజున లింగయ్యను హత్య చేశారు. నిందితుల్లో పండుగ రామస్వామి, పండుగ స్వామి, పండుగ రాములు, పండుగ మల్లేశ్, బండగొర్ల వల్‌రాజు, పండుగ యాదయ్య, జక్కుల రమేశ్, జక్కుల భిక్షమయ్య, పండుగ శ్రీకాంత్, పండుగ సతీశ్, పండుగ నర్సయ్య, పండుగ సత్యనారాయణ, బండగొర్ల నాగమ్మ, పండుగ శ్రీను, పండుగ మల్లయ్య, పండుగ లింగయ్య, జక్కుల లచ్చయ్య, పోలెబోయిన లింగయ్య ఉన్నారు. శిక్ష పడిన వారిలో ఒక్కో ఇంటి నుంచి ముగ్గురు, నలుగురు వ్యక్తులు ఉండడంతో ఆయా కుటుంబ సభ్యులు బోరున ఏడ్చారు.